## కైకలూరు పంచాయతీ కార్మికులకు జీతాలు వెంటనే విడుదల చేయాలి



కైకలూరు జనవరి 9 (ప్రభాతవార్త): నియోజకవర్గ కేంద్రమైన కైకలూరు గ్రామపంచాయతీ కార్మికులకు ఏడు నెలల జీతాల బకాయిలు వెంటనే విడుదల చేయాలని ఏపీ గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) జిల్లా కార్యదర్శి పి కిషోర్, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి రెడ్డి శ్రీనివాస్ డాంగే డిమాండ్ చేశారు. శుక్రవారం గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలపై వారు మాట్లాడుతూ జిల్లాలో 517 సచివాలయాల పరిధిలో, 547 పంచాయతీల నందు 2000 మంది కార్మికులు పనిచేస్తున్నారని తెలిపారు. గ్రామపంచాయతీ లలో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికులు, పంప్ ఆపరేటర్లు, ట్రాక్టర్ డ్రైవర్లు, కంప్యూటర్ ఆపరేటర్లు, ఎలక్ట్రిషన్లు, గుమస్తాలు తదితర కార్మికులందరికీ 3 నుండి 8 నెలలుగా జీతాలు బకాయిలు చెల్లించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. దానికి ఉదాహరణ కైకలూరు పంచాయతీ నే అని అన్నారు. కైకలూరు పంచాయతీ కార్మికులు రెండు నెలల క్రితం రోడ్డు మీదకు వచ్చి ఆందోళన చేసిన ఇప్పటివరకు వారికి జీతాలు చెల్లించకపోవడం సిగ్గుచేటు అన్నారు. పండుగ ఫోటోలో కూడా పంచాయతీ కార్మికులు పస్తులు ఉంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పంచాయతీ కార్మికుల సమస్యలను ప్రభుత్వం అధికారులు పట్టించుకోవడంలేదని విమర్శించారు. జిల్లాలో ఇంకా అనేక పంచాయతీల్లో ఈ విధంగానే 3 నుండి 8 నెలలుగా జీతాలు బకాయిలు ఏర్పడ్డాయని అన్నారు. గ్రామపంచాయతీ వచ్చే ఆదాయం నుండి సిబ్బందికి మొదటగా జీతాలు చెల్లించాలని నిబంధన ఉన్నప్పటికీ, అధికారులు ఆ దిశగా చర్యలు చేపట్టడం లేదని విమర్శించారు. తక్షణమే కైకలూరు పంచాయతీ కార్మికులకు, అలాగే జీతాలు బకాయిలు ఉన్న జిల్లాలో ఇతర పంచాయతీ కార్మికులకు బకాయి జీతం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

## విజయానికి ప్రతిభ నైపుణ్యాలే పునాది



మండవల్లి జనవరి 9 (ప్రభాతవార్త) : విద్యతో పాటు ప్రతిభ నైపుణ్యాలు అనే పునాది పై అవగాహన పెంచుకుంటే లక్ష్యలను కూడా విద్యార్థులు స్పష్టంగా ఏర్పాటు చేసుకోగలుగుతారని ఉమ్మడి కృష్ణాజిల్లా మానవతా సంస్థ కెరీర్ గైడెన్స్ చైర్మన్ ప్రొఫెసర్ డాక్టర్ సుదాబత్తుల విజయకుమార్ అన్నారు. శుక్రవారం మండవల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు జి. శ్రీనివాస్ అధ్యక్షతన మండవల్లి మండల మానవతా స్వచ్ఛంద సేవ సంస్థ అధ్యక్షులు కూనపరెడ్డి బాల కోటేశ్వరరావు ఆధ్వర్యంలో పదవ తరగతి విద్యార్థులకు కేరీర్ గైడెన్స్ పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గౌరవ అతిథిగా పాల్గొన్న ఉమ్మడి కృష్ణాజిల్లా మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షులు కొండ్రెడ్డి సత్యనారాయణ మాట్లాడుతూ చదువులో రాణించే విద్యార్థులకు మానవతా ఎప్పుడు అండగా ఉండి ప్రోత్సహిస్తుందని పేర్కొన్నారు. 2024-25 విద్యా సంవత్సరంలో ఆరు ఏడు ఎనిమిది తొమ్మిది తరగతులలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థిని విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు ప్రశంసా పత్రాలు మరియు మొమెంటోలు అందజేశారు. ఈ కార్యక్రమంలో మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ మండవల్లి మానవత కార్యదర్శి శివయ్య, డైరెక్టర్ బొల్లింపల్లి కృష్ణారావు, సంయుక్త కార్యదర్శి సమయం యేసు బాబు, కైకలూరు ఉపాధ్యక్షురాలు దూలం వాసవి, తలారి గోపాలకృష్ణ, చిట్టి బొమ్మ కనకదుర్గ, ఇమ్మడి విటల్ , మానేపల్లి శివ, నాగమణి మరియూ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## అతి సామాన్య భక్తుడికీ దర్శనం కల్పించాలి



భీమవరం టౌన్ జనవరి 9 ప్రభాతవార్త : అమ్మలుగన్నఅమ్మ మావుళ్ళమ్మ మహాశక్తి స్వరూపిణి అని భీమవరం ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు అన్నారు. భీమవరం పట్టణ ఇలవేల్పు మావుళ్ళమ్మ వారి దేవస్థానం నూతన ధర్మకర్తల మండలి ప్రమాణ స్వీకారం శుక్రవారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదవులు పొందిన వారు గొప్పలకు పోకుండా సామాన్య భక్తులకు కూడా సులువుగా దర్శన భాగ్యం కల్పించాలని సూచించారు గ్రామ దేవత మావుళ్ళమ్మ అమ్మవారి అనుగ్రహంతోనే భీమవరం వేగంగా అభివృద్ధి చెందుతుందని అన్నారు ఆమె ఆశీస్సులతోనే భీమవరం జిల్లా కేంద్రం అయిందన్నారు. 100 కిలోల బంగారం కలిగిన ప్రపంచ ఏకైక దేవత మావుళ్ళమ్మ మాత్రమేనని ఎమ్మెల్యే అంజిబాబు అన్నారు ఎన్డీఏ కూటమి సహకారంతోనే కమిటీ వేయడం జరిగిందన్నారు. మాజీ ఎంపీ తోట సీతారామలక్ష్మి మాట్లాడుతూ మావుళ్ళమ్మ ఆశీస్సులతోనే కూటమి విజయం సాధించింది అన్నారు. అందరికీ ఆమె ఆశీస్సులు ఉంటాయని అన్నారు. ఆలయ చైర్మన్ బొండాడ నాగభూషణం మాట్లాడుతూ జిల్లాలోని అతిపెద్ద దేవాలయం మావుళ్ళమ్మ వారి దేవాలయమేనని 500 గ్రామాలకు ఆమె మహాతల్లి అని అన్నారు. చైర్మన్ గా తనకు అవకాశం రావడం పూర్వ జన్మ సుకృతమే అన్నారు. ఈ సందర్భంగా కూటమి నాయకులకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నానని అన్నారు అమ్మవారి ఆశీస్సులతో అందరూ సుభిక్షంగా ఉండాలని కోరుకుంటున్నాను అన్నారు కూటమి నాయకులు, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

## కళాశాలకు సౌండ్ సిస్టం బహుకరణ.



అత్తిలి జనవరి 9( ప్రభాత వార్త ):అత్తిలి లైన్స్ క్లబ్ అధ్యక్షుడు శిరగాని నాగేశ్వరరావు తన సొంత నిధులతో అత్తిలి ప్రభుత్వ జూనియర్ కళాశాలకు మైక్ సిస్టంను బహూకరించారు. ఇటీవల కళాశాలలో నిర్వహించిన ఒక కార్యక్రమంలో కళాశాలకు మైక్ సిస్టం బహూకరించాలని ప్రిన్సిపాల్ చేసిన అభ్యర్థన మేరకు శిరగాని నాగేశ్వర రావు తన భగవాన్ పూతరేకులు సంస్థ తరఫున అందజేశారు. దాత నాగేశ్వరరావుకు కళాశాల ప్రిన్సిపాల్ ముళ్ళపూడి కృష్ణ సాయి కృతజ్ఞతలు తెలిపారు. నాగేశ్వరరావును కళాశాల తరఫున సత్కరించారు. కార్యక్రమంలో పెద్దిరెడ్డి గంగాధర్,బోడ నరసింహామూర్తి, పెండం రాంబాబు, మట్టపర్తి శివశంకర్, దొంగ సాంబామూర్తి, పెచెట్టి గణపతి, దువాపు ధనరాజు, కలిగితి దయనందమూర్తి తదితరులు పాల్గొన్నారు.

## జోరుగా కోడి పందేలు




కుక్కునూరు-ప్రభాతవార్త, : మండలంలో కోడి పందేలు జోరుగా సాగుతున్నాయి. రోజుకొక చోట గ్రామ శివారు ప్రాంతాల్లో పందెం రాయుళ్లు పందాలు నిర్వహిస్తూ వేల రూపాయిలు బెట్టింగ్ లు కాస్తున్నారు శుక్రవారం మండలంలోని వేలేరు గ్రామ శివారు ప్రాంతంలో కొందరు వ్యక్తులు పెద్ద ఎత్తున కోడిపందాలు నిర్వహిస్తూ బెట్టింగ్ లు నిర్వహించారు. ఈ విషయం పై కుక్కునూరు సర్కిల్ ఇన్స్పెక్టర్ యం రమేష్ బాబు ను ప్రభాతవార్త వివరణ కోరగా కోడిపందేలు జరిగే ప్రదేశానికి మా సిబ్బంది వెళ్ళేసరికి పందెపు రాయుళ్ళు అక్కడినుంచి వెళ్ళిపోతున్నారని తెలిపారు. పందేలు ఎక్కడ జరగకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

## ఘనంగా జె. సి. టి.రాహుల్ కుమార్ రెడ్డి కి పుట్టినరోజువేడుక



భీమవరం జనవరి 9 ప్రభాతవార్త : జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి పుట్టిన రోజు సందర్భంగా శుక్రవారం జాయింట్ కలెక్టర్ ఛాంబర్ నందు డీఆర్వో, జిల్లాలోని పలువురు జిల్లా అధికారులు, ఆర్డీవోలు, తహసిల్దార్లు, కలెక్టర్ కార్యాలయం అధికారులు, సిబ్బంది జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డికి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయనకు శాలువాలు కప్పి పుష్పగుచ్చాలను, మొక్కలను అందజేసి ఆయనకు పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలియజేశారు. భవిష్యత్తులో ఇలాంటి పుట్టినరోజు వేడుకలు మరెన్నో జరుపుకోవాలని, ఆయురారోగ్యాలతో అష్టైశ్వర్యాలతో సుఖ సంతోషాలతో నిండు నూరేళ్ళ జీవించాలని, జీవితంలో మరిన్ని ఉన్నత శిఖరాలకుఎదగాలని ఆకాంక్షంచారు. జాయింట్ కలెక్టర్ కు పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపినవారిలో డిఆర్ఓ బి.శివన్నారాయణ రెడ్డి, వివిధ శాఖల జిల్లా అధికారులు, ఆర్డీవోలు, తహసిల్దార్లు, డీటీలు, సిబ్బంది, తదితరులు ఉన్నారు.

## కామవరపుకోటలో పర్యటించిన మాగంటి బాబు



ప్రభాత వార్త, జనవరి 09 కామవరపుకోట : కార్యకర్తలే తెలుగుదేశం పార్టీకి బలం అని మాజీ మంత్రి ,ఏలూరు మాజీ పార్లమెంటు సభ్యులు మాగంటి.బాబు అన్నారు. శుక్రవారం కామవరపుకోటలో ఇటీవల అస్వస్థతకు గురి అయి ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్న టీడీపీ సీనియర్ నాయకులు నెక్కలపు.గంగాధరరావుని పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలలో గెలుపే లక్ష్యంగా పని చేయాలని పార్టీ కేడర్ కు తెలియజేశారు. అనారోగ్యం నుండి కోలుకుని నెక్కలపు. గంగాధర రావు త్వరలోనే ప్రజా జీవితంలోకి రావాలి అని ఆయన ఆకాంక్షంచారు. ఈ కార్యక్రమంలో చింతలపూడి మాజీ ఎ.ఎమ్.సి చైర్మన్ కోనేరు.సుబ్బారావు,కామవరపుకోట మాజీ జెడ్పీటీసీ ఘంటా సుధీర్ బాబు, కొయ్యగూర. వెంకటేష్, గోరిక. సతీష్,నూతి. రాటాలు, బొంతు.వెంకటేశ్వర రావు తదితరులు పాల్గొన్నారు.

## మట్టపర్తి గర్వు లో నీటి పథకానికి శంకుస్థాపన.

అత్తిలి- జనవరి 9 ( ప్రభాత వార్త )అత్తిలి మండలం అత్తిలి మట్టపర్తి గరువులో అమరజీవి జలధార పథకం కింద నిర్మించే రక్షిత నీటి పథకానికి అత్తిలి ఎంపీపీ మక్కా సూర్యరావు శంకుస్థాపన చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతి ఇంటికి రక్షిత నీరు అందించాలనే ధ్యేయంతో అమర జీవి జలధార పథకాన్ని అమలు చేస్తోందని అన్నారు. కార్యక్రమంలో అత్తిలి ఏఎంసీ చైర్మన్ దాసం ప్రసాద్, నీటి పంపిణీ కమిటీ చైర్మన్ నల్లూరు సురేష్, అత్తిలి సర్పంచ్ గంటా విజేత నాగరాజు, మండల టిడిపి అధ్యక్షుడు పోలిశెట్టి చందు, బిజెపి మండల అధ్యక్షుడు మామిడి శెట్టి నాగబాబు, పట్టణ టిడిపి అధ్యక్షుడు కొ రిపల్లి ప్రసాద్, టిడిపి సీనియర్ నాయకులు ఆల్తి సత్యనారాయణ, మండల కార్యదర్శి ఆల్తి అజయ్, వర్రి శ్రీనివాసు, దాసరి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## భవిష్యత్తు కోసం మంచి ఫలితాలు సాధించండి.

**తాసిల్దార్ పి ఎన్ వి ప్రసాద్.**



ఆగిరిపల్లి జనవరి 9 ప్రభాతవార్త : ఆగిరిపల్లి మండల తహసీల్దార్ పి ఎన్ వి ప్రసాద్ ఆగిరిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల దత్తతా ధికారిగా నియమితులయ్యారు. శుక్రవారం ఆయన పాఠశాలనుసందర్శించి పదవ తరగతి విద్యార్థుల ఫలితాల మెరుగుదల లక్ష్యంగా అమలు చేస్తున్న ఎస్ఎస్సి 100 రోజుల కార్యాచరణ ప్రణాళికను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మార్చి లో జరిగే పదో తరగతి పరీక్షల్లో అత్యుత్తమ ఫలితాలు సాధించటానికి ఏర్పాటు చేసిన కార్యాచరణ ప్రణాళిక ప్రకారం చదివి ఉత్తమ ఫలితాలు సాధించాలని సూచించారు. విద్యార్థుల అభ్యాసస్థాయి బోధన విధానాలు ప్రత్యేక శిక్షణలపై ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు . ఈ కార్యక్రమంలో ఎంఈఓ--2 ఆనంద్ కుమార్, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పులి పుష్పలత విద్యార్థులుపాల్గొన్నారు.

## అదృశ్యమైన కుటుంబాన్ని గుర్తించిన పోలీసులు



నూజివీడు/ ముసునూరు జనవరి09 ప్రభాతవార్త= లోపూడి గ్రామంలో కలకలం రేపిన వెలి ఘటన, సారా అమ్మకూడదంటూ ఆ గ్రామం ఒక కట్టుబాటును విధించుకుంది, నూజివీడు డి.ఎస్.పి శుక్రవారం నూజివీడు విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ బోట్ల కనకారావు అనే వ్యక్తి 2సార్లు ఎక్సైజ్ పోలీసులకు దొరికి జైలుకు వెళ్లడంతో జైలు నుంచి తిరిగి వచ్చిన కనకారావుని గ్రామ పెద్దలు పంచాయతీకి పిలిపించి, అతనిని మోకాళ్లపై కూర్చోబెట్టి, నీవు గ్రామంలో తిరగాలంటే లక్ష రూపాయలు తప్పు కట్టి గ్రామంలో ఉండు లేదంటే నిన్ను వెలివేస్తున్నామని, తీర్పునివ్వటంతో కనకారావు ఒక విషపూరితమైన ప్లాన్ కి స్కెచ్ వేశాడు. వెంటనే తన భార్యను పిల్లలను ఒక దగ్గరకు చేర్చు ఒక సెల్ఫీ వీడియో తీసి నేను నా భార్యా పిల్లలు సూసైడ్ చేసుకుంటున్నామని వీడియో రిలీజ్ చేసి అంతర్ధానం అవటంతో గ్రామంలో ఒక్కసారిగా కలకలం రేగింది. ఈ వీడియో సోషల్ మీడియాలో హల్చల్ చేయడంతో జిల్లా ఎస్పీ ప్రతాప్ శివ కిషోర్, నూజివీడు డిఎస్పి కె వి ఎన్ వి ప్రసాద్ పర్యవేక్షణలో నూజివీడు రూరల్ సీఐ కొప్పిశెట్టి రామకృష్ణ, ముసునూరు ఎస్సై చిరంజీవి, రూరల్ ఎస్సై లక్ష్మణ్ బాబు లతో టీమ్లు ఏర్పాటు చేసి సెర్చ్ ఆపరేషన్ మొదలుపెట్టారు. 4గురు ప్రాణాలు కాపాడటానికి పోలీసులు గ్రామం తో పాటు చుట్టుపక్కల ప్రాంతాలను జల్లెడ పట్టి ఎక్కడ కూడా వీరి ఆచూకీలా దించకపోవడం అలాగే వెళ్లిపోయిన కనకారావు ఎటువంటి సెల్ఫోన్ వాడకపోవడంతో కేసు మరింత జటిలంగా మారింది.

మరలా ఎస్పీ ప్రతాప్ శివ కిషోర్ సూచనల మేరకు సెల్ఫోన్ రాకముందు మిస్సింగ్ కేసులను ఎలా చేదిస్తారో ఆ పద్ధతిలో ముందుకు వెళ్ళమనగా దానిలో సఫలీకృతమై కేసును చేదించి కనపడకుండా పోయిన ఆ నలుగురిన ఆచూకీ తెలుసుకొని శుక్రవారం మీడియా ముందు ఉంచడం జరిగింది.

ఈ క్రమంలో కనకారావు అదే గ్రామానికి చెందిన వేరే అమ్మాయితో జరిపిన సంభాషణ పోలీసులను ఎలా తప్పుదోవ పట్టించింది , పెద్దలను అదుపులోకి తీసుకున్నారా లేదా నేను ఎలా రావాలి ఎప్పుడు రావాలి అనే విషయాలు పోలీసులను ఆశ్చర్యానికి గురిచేశాయి. ఈ విధంగా పోలీసులను తప్పుదారి పట్టించిన కనకారావు పై మరల పోలీసులు మరో కేసు నమోదు చేశారు. ఇటువంటి సమాచార సాధనాలు లేకపోయినా పాత టెక్నాలజీ ఉపయోగించి కనిపించకుండా పోయిన వారే ఆచూకీ 96 గంటలలో కనుగొని కేసుని సాల్వ్ చేసిన నూజివీడు రూరల్ ముసునూరు అధికారులను జిల్లా ఎస్పీ అభినందించారు.

గ్రామ పెద్దలకు ఇది ఒక గుణపాఠమా.

వెలివేసి గ్రామ బహిష్కరణ చేసిన పెద్దలు ఇప్పుడు కటకటాల లెక్కిస్తున్నారు చట్టాన్ని ఎవరైనా సరే తమ చేతుల్లోకి తీసుకొని ఇటువంటి తీర్పులు తప్పులు విధిస్తే ఇబ్బందులకు గురి అవుతారని పోలీస్ శాఖ హెచ్చరిస్తుంది.

## జిల్లా ఎస్సీ మోర్చా కార్యవర్గం ప్రకటన




చాట్రాయి, జనవరి 9, ప్రభాతవార్త భారతీయ జనతా పార్టీ ఏలూరు జిల్లా కార్యాలయం నందు ఏలూరు జిల్లా ఎస్సీ మోర్చా జిల్లా కార్యవర్గాన్నీ జిల్లా బిజెపి అధ్యక్షులు చౌటుపల్లి విక్రమ్ కిషోర్ చేతుల మీదుగా విడుదల చేసినట్లు జిల్లా దళిత మోర్చా అధ్యక్షులు బుర్రి శ్రీకర్ చెప్పారు. ఈ కార్యక్రమంలో ఏలూరు జిల్లా పార్లమెంట్ కన్వీనర్ కట్నేని కృష్ణ ప్రసాద్ , జిల్లా ప్రధాన కార్యదర్శి గాది రాంబాబు, కార్యదర్శి చేకూరి గణపతి, జిల్లా కార్యవర్గ సభ్యులు చాగంటి వాసుదేవరావు తదితరులు పాల్గొన్నారు.

## మాదక ద్రవ్యాల వినియోగం ప్రమాదకరం



వీరవాసరం జనవరి 9 ప్రభాతవార్త : "మాదక ద్రవ్యాల వాడకం సరదాగా మొదలై అలవాటుగా మారి జీవితాన్ని నాశనం చేస్తుందని, మాదక ద్రవ్యాల వినియోగం వ్యక్తిగతంగానే కాకుండా సమాజాన్ని కూడా భ్రష్టు పట్టిస్తాయని, విద్యార్థులు మాదక ద్రవ్యాల నుండి దూరంగా వుండాలని, మాదక ద్రవ్యాలు వినియోగించినా, కలిగివున్నా, రవాణా చేసినా, అమ్మినా, కొనుగోలు చేసినా మాదక ద్రవ్య నిరోధక చట్టం ప్రకారం కఠిన శిక్షకు గురవుతారని" భీమవరం 2వ అదనపు జుడీషియల్ మొదటి తరగతి మేజిస్ట్రేట్ ఎన్.జ్యోతి అన్నారు. రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు భీమవరం మండల న్యాయ సేవా సంస్థ ఆధ్వర్యంలో బాల్య వివాహ నిషేధ చట్టం మరియు మాదక ద్రవ్య నిరోధక చట్టంపై అవగాహన కల్పించుటకు శుక్రవారం వీరవాసరం మండలం నందమూరుగరువు గ్రామ సచివాలయంలో నిర్వహించిన న్యాయ అవగాహనా సదస్సులో న్యాయమూర్తి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ "బాల్య వివాహాలు సామాజిక రుగ్మతయని, వ్యక్తిగత కారణంతోగాని, ఉమ్మడి ఆస్తి కలిసివస్తుందని తదితర కారణాలతో కొన్ని చోట్ల బాల్య వివాహాలను ప్రోత్సహిస్తూ ఉంటారని, బాల్య వివాహాలు చేస్తే శారీరకంగా వచ్చే మార్పుల వల్ల అమ్మాయిలు అనారోగ్యాల బారినపడతారని, బాల్య వివాహాలు చేసుకున్నవారు, చేసినవారు, పురోహితులు, సాక్ష్యులు, పెళ్ళి పెద్దలు అందరూ శిక్షర్హులు అవుతారని" అన్నారు. ఈ కార్యక్రమంలో ప్యానల్ న్యాయవాది పి.అంబేద్కర్, గ్రామ సర్పంచి ఎం.వి.చలపతిరావు, సబ్ ఇన్స్పెక్టర్ ఎం.రాజ్ కుమార్, డీసీపీఓ యూనిట్ బాలల రక్షణ అధికారి దీ.నెహెమియా, ఎస్ ఎం వి టి డిగ్రీ కాలేజి ప్రిన్సిపాల్ వి.దుర్గా ప్రసాద్, రెవిన్యూ ఇన్స్పెక్టర్ ఎస్.నాగేశ్వరరావు, గ్రామ కార్యదర్శి జి.సుబ్బారావు, అంగన్వాడీ కార్యకర్తలు, సచివాలయ సిబ్బంది, డిగ్రీ కళాశాల విద్యార్థులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## వై ఎన్ కాలేజిలో ఘనంగా సంక్రాంతి సంబరాలు



మాట్లాడుతున్న నరసాపురం డి.ఎస్.పి డాక్టర్ శ్రీ వేద



ప్రభాతవార్త నరసాపురం : స్థానిక శ్రీ వై ఎన్ కళాశాలలో సంక్రాంతి సంబరాలు అంబరాన్ని అంటే విధంగా జరిపారు. కళాశాల పాలకవర్గ సభ్యులు భోగి మంట వెలిగించడంతో సంబరాలు మొదలయ్యాయి. ఆ తర్వాత కోలాటాలు, గరగల నృత్యాలు, గంగిరెద్దుల ఆటలతో, విద్యార్థిని విద్యార్థుల సంప్రదాయ దుస్తులతో కళాశాల ప్రాంగణమంతా కోళాహలంగా సంబరాలు జరిగాయి. ఈ సంబరాలకు ముఖ్య అతిథిగా నరసాపురం సబ్ డివిజనల్ డిప్యూటీ సూపరింటెంట్ ఆఫ్ పోలీస్ డాక్టర్ శ్రీ వేద గారు మాట్లాడుతూ, సంక్రాంతిని విద్యార్థుల జీవితాలతో పోల్చారు. సంక్రాంతి పండుగకు ఒక ప్రత్యేకత ఉందని, సంక్రాంతి నాటికి లోగిలన్నీ పంటలతో ధనధాన్యాలతో తుల తూగుతాయని, అందుకే సంక్రాంతి జీవితంలో పరిపూర్ణత తీసుకొస్తుందని, అదేవిధంగా విద్యార్థులు కూడా చక్కగా చదువుకొని, ఉన్నత స్థానాలు అధిరోహించి, పరిపూర్ణమైన జీవితాన్ని గడపాలని ఆకాంక్షంచారు. నేను 9వ నెల గర్భవతిగా ఉన్నప్పుడు ఎంతో కష్టపడి ప్రిలిమినరీ పరీక్షలు రాసి తర్వాత మూడు నెలల్లో మెయిన్ పరీక్షలు రాసి, డి. ఎస్. ఏ. ఉద్యోగాన్ని పొందానని, దృఢ సంకల్పం ఉంటే ఏదీ అసాధ్యం కాదని అందుకే తనని ఆదర్శంగా తీసుకోవాలని విద్యార్థులకు తెలిపారు. ప్రతి ఒక్కరూ డ్రగ్స్ కి దూరంగా ఉండాలని తెలిపారు. మన సబ్ డివిజన్లో స్త్రీ శక్తి యాప్ ను ఏర్పాటు చేశామని, దానిని ఉపయోగించుకుని స్త్రీలకు ఏవైనా ఇబ్బందులు ఎదురైతే ఒక కాల్ చేస్తే వెంటనే సహాయం అందుతుందని తెలిపారు. ఈ కార్యక్రమశీలో కళాశాల వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ చినిమిల్లి సత్యనారాయణ రావు, సెక్రెటరీ అండ్ కరస్పాండెంట్ డాక్టర్ అందే రామ సతీష్, కోశాధికారి పోలిశెట్టి శ్రీ రఘురామారావు, పాలకవర్గ సభ్యులు శ్రీ చేగొండి సత్యనారాయణ రావు, రెడ్డప్ప ధవేజీ, ఆర్ వి సుబ్బారావు, ప్రిన్సిపాల్ డాక్టర్ చింతపల్లి కనకారావు, పీజీ ఇంచార్జి డైరెక్టర్ డాక్టర్ రంగినీడి పార్థసారథి, డైమండ్ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ అందే రామకృష్ణ, బీఈడీ ప్రిన్సిపాల్ డాక్టర్ పి శాంతి, ఇతర ముఖ్యులు మరియు విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

## టీటీడీ వేద పండితులచే వైభవంగా శ్రీనివాస కళ్యాణం మహోత్సవం



ప్రభాతవార్త జంగారెడ్డిగూడెం : జంగారెడ్డిగూడెం పట్టణం లోని సూర్య కిరణ్ ఫంక్షన్ హాల్ ప్రాంగణంలో శ్రీమహావిష్ణువుకు ప్రీతికరమైన పవిత్ర ధనుర్మాసంలో తిరుమల తిరుపతి దేవస్థానం నుంచి విచ్చేసిన వేద పండితులు,ఉత్సవమూర్తులతో మన చింతలపూడి శాసనసభ్యులు సొంగా రోషన్ కుమార్ మరియు కూటమి నాయకుల సారధ్యంలో జరిగిన శ్రీనివాస కళ్యాణం వేడుకలో పాల్గొన్నారు, ఈ కళ్యాణోత్సవంలో జంగారెడ్డిగూడెం పట్టణం నలువైపుల నుంచి వచ్చిన ప్రజలు మరియు కళ్యాణం జరుపుకునే జంటలు పీటలపై కూర్చుని కళ్యాణం తంతు జరిగించుకున్నారు ఆ తరువాత స్వామివారి కళ్యాణాన్ని తిలకించి తీర్థప్రసాదాలు స్వీకరించి ఆ భగవంతుని అనుగ్రహానికి పాత్రులైనారు, చింతలపూడి నియోజకవర్గ ప్రజలు అందరూ సుభిక్షంగా, ఆయురారోగ్యాలతో ఉండాలని ధనధాన్యాలతో విలసిల్లాలని, కూటమి ప్రభుత్వాన్ని దీవించాలని స్వామివారిని వేడుకున్నారు,

## క్రీడాకారులకు వాలీబాల్ కిట్లు పంపిణి



వేలేరుపాడు, జనవరి 9, ప్రభాత వార్త : పోలవరం నియోజకవర్గం శాసనసభ్యులు చిర్రి బాలరాజు పుట్టినరోజు సందర్భంగా వేలేరుపాడు మండల వాలీబాల్ క్రీడాకారులకు వేలేరుపాడు జనసేన పార్టీ కార్యాలయంలో మండల అధ్యక్షులు గణేశుల ఆదినారాయణ చేతుల మీదుగా వాలీబాల్ కిట్లను పంపిణి చేశారు. గణేషుల ఆదినారాయణ మాట్లాడుతూ యువత చెడు మార్గంలో వెళ్లకుండా మత్తు పదార్ధాలకు బానిసలు కాకుండా ఉండాలని మంచి ఆలోచనతో ఎమ్మెల్యే చిర్రి బాలరాజు కిట్లను పంపడం జరిగిందని అదేవిధంగా క్రీడాకారులందరు మంచి స్నేహ భావంతో క్రీడల్లో పాల్గొనాలని , క్రీడలు మనస్సుకి ఉల్లాసాన్ని ఉత్సాహాన్ని కలిగిస్తాయని అన్నారు. ఈ కార్యక్రమంలో వి ఆర్ పురం మండల అధ్యక్షులు ములకపల్లి సాయి,దేవిరెడ్డి సుధాకర్, డాక్టర్ షాను, కోవ్వాల క్రాంతి కుమార్,మాచర్ల వెంకటేశ్వర్లు, టీం లోకేష్ బుడిపిటి సురేష్ మరియు ఎండి నయీమ్ తదితరులు పాల్గొన్నారు.

## సమస్యల సత్వర పరిష్కారమే ప్రభుత్వ ధ్యేయం- ఎంఏ షరీఫ్



ప్రభాతవార్త నరసాపురం : నరసాపురం నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో, నరసాపురం నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ పొత్తూరి రామరాజు ఆధ్వర్యంలో ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక వేదికగా "గ్రీవెన్స్ – ప్రజా సమస్యల పరిష్కార వేదిక"లిను ఏర్పాటు చేసారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా మాజీ శాసన మండలి చైర్మన్, రాష్ట్ర మైనారిటీ అఫైర్స్ అడ్వైజర్ ఎమ్.ఎ. షరీఫ్ పాల్గొన్నారు ఈ వేదిక ద్వారా నియోజకవర్గానికి చెందిన ప్రజలు మరియు పార్టీ కార్యకర్తల నుండి ఇళ్ల స్థలాలు మరియు పెన్షన్లు,రోడ్లు, డ్రైనేజీలు, ఇంకా తదితర స్థానిక సమస్యలపై వినతులు, ఫిర్యాదులు, అభ్యర్థనలు స్వీకరించబడినాయి. స్వీకరించిన ప్రతి సమస్యను సవివరంగా పరిశీలించి, వాటికి తగిన పరిష్కారం దిశగా సంబంధిత అధికారులతో వెంటనే సంప్రదింపులు జరిపి, ప్రతి సమస్య పరిష్కారానికి కార్యాచరణ ప్రారంభించడం జరిగింది.

## ఘనంగా సంక్రాంతి సంబరాలు



చింతలపూడి.. ప్రభాత వార్త : స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల చింతలపూడిలో కల్చరల్ కమిటీ ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలను ఘనంగా నిర్వహించుకోవడం జరిగింది. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డా. పి శ్రీనివాసరావు మాట్లాడుతూ సంక్రాంతి మన భారతీయ సంస్కృతిలో అత్యంత ప్రాచీనమైన, శాస్త్రీయమైన పండుగ. ఇది కేవలం పంట పండుగ మాత్రమే కాదు జీవన తత్వాన్ని బోధించే పండుగ. సూర్యుడు దక్షిణాయనం నుంచి ఉత్తరాయణానికి ప్రయాణించే శుభ సమయాన్ని సూచించే ఈ పండుగ, మన జీవితాల్లో కూడా కొత్త వెలుగులు తీసుకురావాలని సందేశాన్ని విద్యార్థులకు అందించారు. కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ఎన్. జె .కె నరేంద్ర కుమార్ మాట్లాడుతూ మూడు రోజులుగా జరుపుకునే ఈ పండుగలో భోగి: పాత అలవాట్లు, అలసత్వం, నెగెటివిటీని అగ్నిలో వేసి, కొత్త ఆలోచనలకు స్వాగతం పలుకుతుంది. మకర సంక్రాంతి: కృతజ్ఞత భావాన్ని నేర్పుతుంది. రైతులకు, ప్రకృతికి, సూర్యుడికి మన కృతజ్ఞతను తెలియజేస్తాం. కనుమ: పశువులు, వ్యవసాయం, గ్రామీణ జీవన విలువలను గుర్తు చేస్తుందనీ విద్యార్థులతో ముచ్చటించారు. కల్చరల్ కమిటీ కోఆర్డినేటర్ డా .బి సరస్వతి మాట్లాడుతూ కష్టపడితే ఫలితం తప్పకుండా వస్తుంది.రైతు విత్తనాన్ని నాటి, శ్రమించి, పంటను పండిస్తాడు. అదే విధంగా మీరు కూడా చదువులో శ్రమిస్తే, విజయం మీ దరిదాపుల్లోనే ఉంటుంది. ఈ పండుగ మనకు ఐక్యత, సహకారం, సాంస్కృతిక గౌరవం నేర్పుతుంది. కులమత భేదాలు లేకుండా అందరూ కలిసి జరుపుకునే పండుగ కావడం వల్ల, సామాజిక సమానత్వానికి ఇది ప్రతీక అనే హితబోధ చేశారు. ఈ సందర్భంగా ముందుగా కళాశాల ప్రిన్సిపాల్ మరియు వైస్ ప్రిన్సిపల్ భోగిమంటలతో మొదలుపెట్టి తదుపరి కార్యక్రమాలను నిర్వహించడం జరిగింది. ఈ పోటీలలో విద్యార్థులు ఆసక్తిగా పాల్గొని వారి నైపుణ్యాలను చాటుకున్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు మరియు విద్యార్థులు పాల్గొని ఈ ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా ముగించడం జరిగింది.